క్లుప్తంగా

లక్ష్మీనర్సింహాస్వామికి ఎమ్మెల్యే పూజలు



భూత్పూర్: అడ్డాకుల మండలం కాటవరంలో సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి లక్ష్మీనర్సింహాస్వామి ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

చిన్నచింతకుంటకు ఐటీఐ మంజూరు

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలానికి రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐని మంజూరైనట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం జారీ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఐటీఐ కళాశాల ఏర్పాటుకు రూ.45 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఐటీఐని మండలంలోని పల్లమరి గ్రామంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలానికి ఐటీఐ మంజూరు కావడంతో మండంలోని విద్యార్థులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

భగీరథ నీటి సరఫరా నిలిపివేత

దేవరకద్ర: పైప్‌లైన్ల మరమ్మతు కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 20వ తేదీ బుధవారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ అధికారి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంరెడ్డి గూడెం దగ్గర వాల్వ్ రిపేర్, క్రిష్టియన్‌పల్లి దగ్గర 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పైపులైన్ మార్చే పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. మన్యంకొండ నీటి శుద్ధీకరణ ప్లాంట్ నుంచి నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని తెలిపారు. మహబూబ్‌నగర్ పురపాలికకు పాక్షికంగా, దేవరకద్ర పురపాలికకు పూర్తిగా మక్తల్, నారాయణపేట మరో 258 గ్రామాలకు నీటి సరాఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

జేపీఎన్‌సీఈలో ఓరియంటేషన్ కార్యక్రమం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓ రియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంజినీరింగ్‌లో నాలుగు సంవత్సరాలు కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్నారని, ప్రతిష్టాత్మక కంపెనీల్లో చేరి మంచి వేతనాలు పొందడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా 10వేల లోపు ర్యాంకు పొంది కళాశాలల అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఇంటర్‌లో 900 మార్కులకు పైగా సాధించిన వారికి నగదు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ భాస్కర్, కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, చంద్రశేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాసేవకే పోలీసులు



గండేడ్: ప్రజాసేవ కోసమే పోలీసులు ఉన్నారని ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని విశ్వ భారతి జూనియర్ కాలేజీలో 'ప్రజా భద్రత–పోలీసు బాధ్యత' అనే కార్యక్రమం నిర్వహించారు. సురక్షపోలీసు కళాబృందం పాటలతో అక్రమ రవాణా నిరోధక విభాగం, షీ టీమ్ సభ్యులు విద్యార్థులు అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడితే షీ టీమ్‌లు కొండంత అండగా ఉంటాయన్నారు.

సందర్శకులతో సందడి



దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు అందాలను చూసేందుకు సందర్శకులు తరలి వస్తున్నారు. సోమవారం ఉందయం నుంచి ప్రాజెక్టు ప్రాంతమంతా సందర్శకులతో నిండి పోయింది. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాక జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేకంగా కుటుంబాలతో వచ్చి ప్రాజెక్టు అందాలను చూస్తు ఆహ్లాదంగా గడిపారు. కోయిల్‌సాగర్ గేట్లు వాగు పరివాహక ప్రాంతం అయిన కోయిల్‌సాగర్ నుంచి చిన్నచింతకుంట వరకు ఉన్న 11 చెక్‌డ్యామ్‌లు అన్ని పొంగి పొర్లుతున్నాయి. బండర్‌పల్లి చెక్‌డ్యామ్ నుంచి పారుతున్న నీటిని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

బహుజనుల ధీరుడు పాపన్నగౌడ్

- నివాళులర్పించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: నాడు కులవృత్తులను ఏకం చేసిన గొప్పవ్యక్తి సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా రాజాపూర్ మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయ్ పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేశారు.

❖ మహబూబ్‌నగర్‌లో.. సర్దార్ పాపన్నగౌడ్ బహుజన విప్లవకారుడని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మోడల శ్రీనివాస్‌సాగర్ అన్నారు. సర్దార్ పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

❖ నవాబుపేట మండల కేంద్రంలో సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.



రాజాపూర్‌లో కేక్ కట్‌చేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

❖ గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, గండేడ్ మండల కేంద్రంలో సర్దార్ పాపన్న విగ్రహానికి గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రయ్య గౌడ్, సర్దార్ పాపన్న యువజన సంఘం అధ్యక్షుడు ద త్తుగౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

❖ జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని గౌడ ఫంక్షన్ హాల్లో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

❖మహమ్మదాబాద్ మండల కేంద్రంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతిరంగ్యానాయక్, కో ఆప్షన్ సభ్యుడు రహీం, మాజీ ఎంపీటీసీ రాధిక, ఆర్యవైశ్య నాయకుడు పాల్గొన్నారు.

పీడితులు ఏకమైతే రాజ్యాధికారం : ఎమ్మెల్యే యెన్నం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీడితులు, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన ధీరుడు సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పద్మావతికాలనీలోని సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా బీసీ అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్‌చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం..

మహిళలను కోటీశ్వరులను చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద ఇందిరామహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాకేఫ్‌ను ప్రారంభించారు. అనంతరం వీరన్నపేటలోని నీలకంఠస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నవాబుపేటలో..



మహబూబ్‌నగర్‌లో పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సమాజ్ నాయకులు

చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక టీడీగుట్ట సమీపంలోని కూరగాయల మార్కెట్, రైతుబజార్‌లోని చిరువ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయనను అక్కడి వ్యాపారులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, మిగతా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో చిరువ్యాపారుల సంఘం అధ్యక్షుడు చందు, నాయకులు క్రాంతికుమార్, ఆంజనేయులు, ఉబేర్, మొగులయ్య, అబ్దుల్‌అజీజ్, మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రిషి విద్యార్థి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రిషి హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి గౌతమ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆగస్టు 16న జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ చంద్రకళ, డైరెక్టర్స్ పూజిత, శిరీష ప్రవీణ్, సాయిసుశాంత్, కృష్ణ, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్లు ప్రతిభచాటాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సోమవారం నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్–15 వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలుర, బాలికల జట్లు తరలివెళ్లాయి.

రోడ్డుకు మరమ్మతు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌యూబీ వద్ద పోస్టాఫీస్ ఎదురుగా రోడ్డుపై గుంతలు పడటంతో సోమవారం ఉదయం ద్విచక్ర వాహనదారులు పలువురు కిందపడి క్షతగాత్రులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అక్కడికి చేరుకుని వెట్‌మిక్స్ లారీ తెప్పించి గుంతలు పూడ్చించారు. దీంతో వాహనదారులు చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల ధర్నా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌తో పాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యావిధాన చట్టాన్ని తెచ్చిందన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, రాష్ట్ర నాయకులు గోపాల్, గౌసియాబేగం, సరోజ, కమల, నవిత, రాజేశ్వరి, కవిత, పద్మ, స్వాతి, సుజాత, భారతి, లీలావతి, నర్మద, నాగలక్ష్మి పాల్గొన్నారు.

అలుగు పారిన పెద్ద చెరువు



అలుగు పారుతున్న నవాబుపేట, యన్మన్‌గండ్ల జంట గ్రామాల చెరువు



తెగిపోయిన కారూర్ చెక్ డ్యామ్

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు యన్మన్‌గండ్ల జంట గ్రామాలను కలుపుతూ ఉన్న పెద్ద చెరువు తాజాగా సోమవారం నిండి అలుగు పారింది. ఆయకట్టులోని 4 గ్రామాల ప్రజలు సంబుర పడ్డారు. రెండేళ్ల క్రితం ఇదే నెలలో నిండిన చెరువు అలుగు పారిన రోజే కట్ట తెగి చెరువంత ఖాళీ అయ్యింది. దీంతో చెరువు కట్టను తాజాగా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. రుద్రారం చెరువు సైతం అలుగు పారింది. దీంతో తహసీల్దార్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు చెరువులను పరిశీలించి, దానిపై నిత్యం పర్యవేక్షణకు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

తెగిన చెక్ డ్యామ్

మండలంలోని కారూర్ గ్రామంలో నిర్మించిన చెక్ డ్యామ్ తెగిపోయింది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు పారుతుండటంతో చెక్ డ్యామ్ నిండింది. చెక్ డ్యాం పరిధిలో ఇసుక తరలింపు చేసిన నేపథ్యంలో తాజాగా చెక్ డ్యాం పూర్తిగా తెగిందని రైతులు వాపోయారు.

ఎడ తెరిపిలేని వర్షాలు

హన్వాడ: మండలంలో నాలుగురోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులకు గండ్లు పడుతున్నాయి. తాజాగా మండల పరిధిలోని అమ్మాపూర్, టంకర, గుడ్డిమల్కాపూర్ చెరువులు లీకయ్యాయి. అమ్మాపూర్ శివారులోని చెరువుకట్టకు గండి పడడంతో నీరంతా వృథాగా పారుతోంది. టంకర ఊరచెరువు తూము ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. గుడ్డిమల్కాపూర్ కుంట పరిస్థితి టంకర చెరువు మాదిరిగా తూము కూలిపోవడంతో చెరువులోని నీరంతా బుద్దారం చెరువులోకి వెళ్తోంది. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వరి పంట పరిశీలన

భూత్పూర్: అడ్డాకుల మండలం గుడిబండ గ్రామానికి చెందిన రైతు మోహన్ పెద్దవాగు ఉధృతికి వరి పంట కొట్టుకుపోగా తహసీల్దార్ శేఖర్, మండల వ్యవసాయాధికారి భ్యాల పరిశీలించారు. నష్టపరిహారం అందించాలని రైతు తహసీల్దార్‌కు వివరించారు.



అమ్మాపూర్ చెరువుకట్టకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

పోలేపల్లిని సందర్శించిన తహసీల్దార్

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి గ్రామాన్ని సోమవారం తహసీల్దార్ నర్సింగ్‌రావు సందర్శించారు. గ్రామ రంగనాయక చెరువు అలుగు పారుతుండటంతో వరదనీరు గ్రామాన్ని ముంచెత్తుతుండటంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆయన గ్రామాన్ని సందర్శించారు. వరదనీరు ప్రవాహాన్ని అడ్డుకుంటున్న ప్రహరీ కింద కొంత తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో వరదనీరు ప్రవాహం తగ్గింది. వరదముంపు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నర్సింగ్‌రావు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

రహదారిపై కూలిన చెట్లు

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని గోప్లాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై చెట్లు కూలికింద పడ్డాయి. స్పందించిన పోలీసులు జేసీబీతో రోడ్డుపై పడ్డ చెట్లను తొలగించారు. మండలంలో నాలుగు ఇళ్లు కూలిపోయినట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు.

రజకులను ప్రభుత్వం ఆదుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కుల వృత్తినే నమ్ముకుని జీవనం సాగించే రజకులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రజక సంఘం పట్టణ అధ్యక్షుడు దుర్గేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పట్టణంలో ఆయా చెరువుల వద్ద ఆధునిక దోభీగాట్లను నిర్మించాలని కోరారు. పట్టణంలోని కొన్ని షాపుల యజమానులు విద్యుత్ బిల్లు బకాయిలున్నారని, వాటిని రద్దు చేయాలన్నారు. పట్టణంలోని పద్మావతి కాలనీ, శ్రీనివాస్ కాలనీ, ప్రాంతాల్లో సంఘం సమావేశాలు జరుపుకోవడానికి కమ్యూనిటీ భవనం కోసం స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం కలెక్టర్ విజయేందిర బోయికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నరసింహులు, పాండు, మల్లేష్, సాయి, బాబురావు, రాఘవేంద్ర, మహేష్; రాములు, చెన్నయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రాగన్ షోటోకాన్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఇండో–నేపాల్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ విద్యార్థుల ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు డ్రాగన్ షోటోకాన్ మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలిపారు. ఈ పోటీల్లో కతా బాలురలో 7 ఏళ్ల విభాగంలో కె.వర్షిత్, 9 ఏళ్ల విభాగంలో సాత్విక్, 10 ఏళ్ల విభాగంలో దేవాన్ష్, ఎండీ.అనస్, 13 ఏళ్ల విభాగంలో అన్షుమన్‌రెడ్డి, రాయన్ శామ్యుల్, కతా బాలికల 9 ఏళ్ల విభాగంలో మనస్విని, 12 ఏళ్ల విభాగంలో జి.సహర, జి.శ్రావ్య బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. కుమితే 14 ఏళ్ల బాలికల విభాగంలో ఫలక్ బంగారు పతకం పొందినట్లు తెలిపారు. బాలుర విభాగంలో జక్సటిన్, హుజేఫా, బాలికల్లో ఇవాన్‌జలిన్, జీవిత, సాగరిక రజత పతకాలు, కతా బాలుర విభాగంలో అఫ్సాన్, తాలిబ్ హుస్సేన్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ స్పోర్ట్స్ ఫౌండర్ సాలంబిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, ఉపాధ్యక్షుడు కె.అంజన్‌ప్రసాద్, సీనియర్ మాస్టర్ ఫహీమ్ అభినందించారు.

చెరువులకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

- హేమసముద్రం చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: ఇరిగేషన్ శాఖ మంత్రితో మాట్లాడి అత్యధిక నిధులతో మండలంలోని అన్ని చెరువులకు మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కారం చూపిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని హేమసముద్రం చెరువును పరిశీలించారు. రెండురోజుల ముందు చెరువుకు గండిపడిన విషయం తెలుసుకున్న కలెక్టర్ చెరువును పరిశీలించి మరమ్మతు చర్యలకు ఆదేశించి వెళ్లిన విషయం పాఠకులకు విధితమే. కాగా చెరువు కట్టకు ఏర్పడి గండి మరమ్మతులు పూర్తి చేసిన అధికారులు నీరు లీకవకుండా తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మరో మారు చెరువుకు ఏర్పడిన గండిని పూడ్చిన చర్యలను పరిశీలించారు. మండలంలోని మరిన్ని చెరువులకు మరమ్మతులు అవసరమని, వచ్చే ఏడాది ఇలాంటి పరిస్థితి ఉండదని భరోసా ఇచ్చారు. మండలంలోని అన్ని చెరువులకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్పీ వెంకటేష్, ఎం.సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ సిరాజ్‌ఖాద్రి, నాయకులు మహేందర్, కృష్ణయ్యయాదవ్, చెన్నయ్య, సత్యారెడ్డి, కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, ఆంజనేయులు, తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపీడీఓ యశోద, రైతులు ఉన్నారు.



హేమసముద్రం చెరువుకట్ట పరిశీలనకు ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

యూరియా సరఫరాపై దృష్టి సారించండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మే చివరి వారంలో వర్షాలు ప్రారంభం కావడంతో జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు కురవడం వల్ల రాష్ట్రంలో వరి పత్తి, మిర్చి, పప్పు దినుసులు, అనేక రకాల పంటలు రైతులు ఒకేసారి సాగు చేయడం, యూరియా స్టాక్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల సమస్య ఏర్పడిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. యూరియా సరఫరాపై దృష్టి సారించాలని సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా మాట్లాడారు. వానాకాలం పంటకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చైనా, జర్మనీ, ఇరాన్, యుమాన్ వంటి దేశాల నుంచి రావాల్సిన యూరియా సరఫరా కావడం లేదన్నారు. రాబోయే 45రోజుల పాటు యూరియా సరఫరాపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ డీలర్ల వద్ద 35వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్, జిల్లా సహకార అధికారి శంకరాచారి, పరిశ్రమల శాఖ జీఎం ప్రతాప్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి బాలమణి సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్ పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

వరదపాయశం పూజలు



భూత్పూర్: మూసాపేట మండల కేంద్రంలోని పురాతన శ్రీరామలింగేశ్వర ఆలయంలో శ్రావణమాసం ఆఖరి సోమవారం సందర్భంగా వరదపాశం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంకల్పసిద్ధిగా పేరుగాంచిన శ్రీ రామలింగేశ్వర పురాతన దేవాలయంలో ఒకటి కావడంతో ప్రతి ఏటా శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయ కమిటీ సభ్యులు నరేందర్ సాగర్, యుగేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు సురేశ్ ఎంపిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఈ నెల 20 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలకు ప్రతినిధిగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేశ్‌ను ఎంపిక చేసినట్లు సోమవా రం ఒక ప్రకటనలో తెలిపారు. సురేష్ ఎంపిక కావడంతో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు దేవానంద్, మొగులయ్య, గోపాల్‌నాయక్, బుచ్చన్న, చెన్నయ్య, నర్సింహ, రాములు హర్షం వ్యక్తం చేశారు.

అలరించిన ఉట్టి ఉత్సవం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆలయం ఎదురుగా నిర్వహించిన ఉట్ల ఉత్సవ కార్యక్రమం వీక్షకులను అలరించింది. యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టేందుకు ప్రయత్నించారు. నిఖిల్ ఉట్టిని కొట్టగా బాలకృష్ణ భక్త సమాజం అతడిని ఘనంగా సత్కరించింది.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వచ్చే నెల 1న సీపీఎస్‌కు వ్యతిరేకంగా నిర్వహించే మహాధర్నా పోస్టర్‌ను పీఆర్టీయూ నాయకులు మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల సీపీఎస్ పెన్షన్ స్కీం ఆశానిపాతంగా మారిందని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గడ్డం అంజయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వరమ్మ, రామచంద్రారెడ్డి, రామ్మోహన్, రాములు, దత్తప్రసాద్ పాల్గొన్నారు.

హన్వాడ: పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరతూ చేపట్టిన సీపీఎస్ రద్దు మహాధర్నా పోస్టర్‌ను మండల కేంద్రంలో విడుదల చేశారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపీడీఓ యశోద, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి విజయానంద్‌రెడ్డి, గోవిందమ్మ, కుర్మన్న, శ్రీనివాస్, నారాయణ, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

దేవరకద్ర రూరల్: స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పెద్దరాజమూరులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, ఆట వస్తువులు, యోగాకు సంబంధించిన మ్యాట్లు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాంచ్ ఇన్‌చార్జి వరదాస్, భరత్ కుమార్, రాజు, ప్రధానోపాధ్యాయురాలు కవిత, పాఠశాల సిబ్బంది శంకర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహాంకాళమ్మ బోనాలు



రాజాపూర్: మండలంలోని రాయపల్లిలో సో మవారం గ్రామంలోని కురుమ యాదవులు మహాంకాళమ్మ బోనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో నిమహాంకాళమ్మ, బీరప్ప దేవాలయాలను సుందరంగా అలంకరించారు. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని గ్రామంలో ఊరేగించిన అనంతరం గ్రా మ శివారులో ఉన్న అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నా రు. కురుమ యాదవు లు పుల్లయ్య, ఎర్రన్న, జంగిలయ్య, శ్రీశైలం, వెంకటేష్, శ్రీను యాదవ్ పాల్గొన్నారు.

మిడ్జిల్: శ్రావణ మాసం చివరివారం కావడంతో సోమవారం మండలంలోని బోయిన్‌పల్లి, వాడ్యా ల్, మున్ననూర్, అయ్యవారిపల్లి, వల్లభ్‌రావుపల్లి, వస్పుల, వెలుగొమ్ముల గ్రామాలలో గ్రామ దేవత పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయాల చుట్టు ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పాతబజార్, జడ్చర్ల వద్ద ఉన్న పోచమ్మ దేవాలయాల్లో మంగళవారం బోనాల ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు రెండు ఆలయాల్లోనూ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేశారు.